కథ

# కామేశం-కలర్ ప్రాసెస్

పరిజాల సుధాకర్

ఇప్పుడు-

కామేశం వయస్సు 52 సంవత్సరాలు!!


పాపం అతనికి 26 సంవత్సరాలనుంచే జుత్తు పండిపోసాగింది. అంత తక్కువ వయస్సులో జుత్తు పండేసరికి, అతను రెండో పెళ్లివాడిలా కనపడేవాడు.

కాబట్టి- ఏ అమ్మాయి అతనిని నచ్చేది కాదు.

అదే- జుత్తు పండకపోతే సినీ హీరోలా వుండేవాడు.

కానీ ఏం లాభం?

పండు కోతిలా కనపడేవాడు.



మరో అయిదు సంవత్సరాలు నానా యాతనా పడి దాదాపు వంద సంబంధాలు చూశాడు. ఆఖరిగా 31 సంవత్సరాలు దాటాక 32వ సంవత్సరం నాడు అనగా అతని జన్మదినం నాడే అతని పెళ్లి వెంకటలక్ష్మితో అయ్యింది.

దానికి కారణం – జుత్తుకు ఫుల్‌గా 'రంగు' వేసుకొని మరీ పెళ్లి చూపులకు వెళ్లాడు.

వయస్సు ఎక్కువ వున్న హీరోలా కనపడే సరికి కాదనలేకపోయింది వెంకటలక్ష్మి.

'ఋణాను బంధ రూపేణా పశుపత్ని సుతాలయా' అనుకున్నాడు. శోభనం అయిపోయింది.

మూడు రాత్రులూ అయిపోయాయి.

పదహారు రోజుల పండగా అయిపోయింది.

తిరిగి పెళ్లాంతో సహా వేరు కాపురం కూడా అయింది. నెల తిరిగే సరికి-

జుత్తు ఓ పక్క నుంచి మొక్కజొన్న పొత్తు బొచ్చులా తయారవసాగింది.

''అదేంటండీ? మీ జుత్తు అలా అయిపోతోంది? నిజంగా మీరు మొదటి పెళ్లికొడుకేనా? పెళ్లికి ముందు 'రంగు' వేసుకొచ్చి నన్ను మోసం చేసారు కదూ?''అందామె ఏడుపు స్వరంతో!

''నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా? పాత సినిమాలో ఎన్టీఆర్‌లా అడిగాడు.

''నిజమే చెప్పండి'' అందామె చెంగు నోటికి అడ్డం పెట్టుకొని.

''మా బాబాయి నన్నో సెలూన్‌కి తీసుకెళ్లి 'కటింగ్' చేయించి, ఆ తర్వాత బలవంతంగా హెయిర్ డై కూడా వేయించాడు. ఫుల్‌గా 'రంగు' కొట్టించేడు. ఆ తర్వాతనే నిన్ను చూడ్డం, నేను నీకు నచ్చడం, చకచకా పెళ్లి జరి

గిపోవడం, అంతా కలలా వుంది'' అన్నాడు.

''నన్ను మోసం చేశారు. నేను పుట్టింటికి పోతాను'' ఏడుస్తూ అంది వెంకటలక్ష్మి.

''చూడు, జుట్టు పండడం అనేది హెరిడిటీ బట్టీ వుంటుంది. మెలనిన్ తక్కువైతే కొందరికి త్వరగానే పండిపోతుంది. నాకు ఆ ఒక్క లోపం తప్పా, కన్నొంకరా? కాలొంకరా? ఇప్పుడు ఈ మిష మీద వెళ్లిపోయి, పండంటి కాపురాన్ని కూలదోసుకుంటావా? కాదూ కూడదూ అంటే కంటిన్యూగా కలర్ వేసుకొంటాను''

అప్పటికి ఆమెను శాంతింప చేసాడు.

అంతే- ఆరోజు సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూనే గొద్రేజ్ హెయిర్ డై పేకెట్ పట్టుకు వచ్చాడు.

ఆ మర్నాడు ఉదయం షేవింగ్ అయ్యాక-

అద్దం ముందు కూర్చొని-

టూత్ బ్రష్‌తో నెరసిన చెంపలు అన్నీ వేసుకోసాగాడు. ఆ రంగు అలా వేసుకుంటుంటే, షర్ట్ అంతా తుళ్లిపోయింది. లుంగీ నిండా నల్ల రంగు జల్లి పోయింది.

ఎదురింటి కామాక్షి అతడి 'అవస్థ' చూసి నవ్వింది.

''ఏంటండీ అన్నయ్యగారూ జుత్తుకు 'రంగు' వేస్తే గాని మా వెంకటలక్ష్మికి హీరోలా కనిపించరా?'' అని సూటిగా అడిగేసింది.

''అదేం కాదండీ! అస్సలు నన్నే వదిలేస్తానంది.''

''ఆహా! అందుకే భయపడి 'రంగు' వేసుకుంటున్నారా?''

''మరేం''

''అయినా నాకెందుకు లెండి? అది మీ స్వంత వ్యవహారం'' అనేసి లోపలకి వెళ్లిపోయిందామె.

ఎన్నెన్ని అవమానాలు? 32వ ఏడు నుండి ఎన్నో సార్లు రంగు వేస్తుండడం- నెల్లాళ్లకే అది వెలిసిపోవడం - జుత్తు రాగి రంగులా మారిపోవడం ఇలా జరిగేది.

ప్రతినెలా రంగు వెయ్యాలంటే విసుగేసేది.

ఒకోసారి రెండు మూడు నెలల దాకా వేసేవాడు కాదు.

ఓసారి సిటీబస్‌లో ఒకావిడ-

''తాతగారి పక్కన కూర్చో'' అని ఓ పదేళ్ల అబ్బాయిని కూర్చోబెట్టింది.

''అంటే? పట్టుమని 40 ఏళ్లు కూడా లేని తను అందరి దృష్టిలో 60 ఏళ్ల వాడిలా కనిపిస్తున్నాడా?'' అనుకున్నాడు.

ఓసారి ఆఫీసుకి ఇన్‌స్పెక్షన్‌కి ఓ పెద్దాయన వచ్చాడు.

ఆ వ్యక్తి తనని చూసి, వెంటనే ''ఆర్ యూ ఏ రిటైర్డ్ పర్సన్'' అని అడిగాడు.

అంటే, తను 40 ఏళ్లకే 'రిటైర్' అయిపోయిన వాడిలా కనపడ్డాడా?!

మళ్లీ సెలూన్‌కి వెళ్లాడు.

కటింగ్ చేస్తున్నవాడు ఊరుకోకుండా ''మేం రంగు వేస్తే మూడు నెలలు పట్టి వుంటుంది సార్! స్టోన్స్ నూరి మరీ వేస్తాం సార్! ఏభయి రూపాయిలు నా ముఖాన కొడితే, మూడు నెలలు వుండేలా 'రంగు' వేస్తాను సార్!'' అన్నాడను.

''గ్యారంటీయా?''

''గ్యారంటీ''

''ఛాలెంజా?''

''ఛాలెంజ్''

''సరే త్వరగా వేయి'' ఆర్డర్ ఇచ్చాడు కామేశం.

వాడు వెంటనే-

ఒక నల్ల గుడ్డ తీశాడు.

మెడ చుట్టూ కట్టాడు.

తన శరీరం చుట్టూ కప్పాడు.

అద్దంలో తన ప్రతిబింబం ఆశ్చర్యంగా కనపడింది.

గబగబా ఏవో స్టోన్స్ నూరాడు.

ఇంకా ఏవేవో కలిపాడు.

ఒక బ్రష్ తీసుకొని జుత్తు మొదళ్ల గుండా పోనిస్తూ రంగే వేయసాగాడు.



''చూడు, జుట్టు పండడం అనేది హెరిడిటీ బట్టే వుంటుంది. మెలనిన్ తక్కువైతే కొందరికి త్వరగానే పండిపోతుంది. నాకు ఆ ఒక్క లోపం తప్పా, కన్నొంకరా? కాలొంకరా? ఇప్పుడు ఈ మిష మీద వెళ్లిపోయి, పండంటి కాపురాన్ని కూలదోసుకుంటావా? కాదూ కూడదూ అంటే కంటిన్యూగా కలర్ వేసుకొంటాను''

సుమారుగా అరగంట సేపు వేసాడు.

తన రూపం తనకే ఆశ్చర్యంగా వుంది.

కుర్ర హీరోలా వున్నాడు తను.

ఆ తర్వాత-

ముఖం మీద తుళ్లిన మరకలన్నీ తుడిచాడు.

ట్రిమ్‌గా తయారు చేసాడు.

''గుడ్-చాలా బాగా వేసావు'' అని ఏభయ్ నోటిచ్చాడు.

ఇంటికి వస్తుంటే-

వీధి వీధంతా ఆశ్చర్యంగా చూసారు.

కొందరైతే-

''కలర్ కొట్టారా? పోల్చుకోలేం సుమండీ'' అన్నారు.

ఆఫీసుకెళ్లాడు.

లేడీ క్లర్కు చూసి కసుక్కున నవ్వింది.

''ఏంటి? కామేశం గారు, కలర్ వేసినట్లున్నారు?'' అంది.

ఆ రోజంతా అందరూ అలానే పలకరించారు.

కొందరైతే 'ఎద్దేవా' చేశారు.

అయితే-

కలర్ వేసిన ఆనందం ఎన్నాళ్లో నిలవలేదు.

నెల తిరిగేసరికి జుత్తు మళ్లీ తెల్లబడసాగింది.

వెంటనే ఆ సెలూన్‌కి వెళ్లాడు.

''ఏడీ? ఆ రోజు ఛాలెంజ్ చేసిన ఆ అబ్బాయి ఏడి?'' విరుచుకు పడ్డాడు.

''మా మేనల్లుడా? మీకు 'రంగు' వేసిన మర్నాడే విజయవాడ వెళ్లిపోయాడు'' అన్నాడు షాపతను.

నిరాశగా వెనక్కి వచ్చేశాడు.

***

కాలగర్భంలో మరో పదేళ్లు గడిచాయి.

తనకీ 50 ఏళ్లు దాటాయి. హోదా పెరిగింది.

ప్రమోషన్ కూడా వచ్చింది.

సూటు బూటు వేసుకోసాగాడు.

అంతా బాగానే వుంది.

***

ఆఫీసు పనిమీద అర్జెంటుగా కాకినాడ వెళ్లాల్సి వచ్చింది.

తిరిగి వస్తున్నప్పుడు-

వైజాగ్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు.

50 ఏళ్లు దాటాక ఇక నా జుత్తుకు 'రంగు' ఎందుకులే, అని సరిపెట్టుకుని, పూర్తిగా మానేసాడు.

ఎవరో 25 సంవత్సరాల ఆవిడ ఒక శిశువుతో సహా 'బస్' ఎక్కింది. బస్ చాలా రద్దీగా వుంది.

''అమ్మా! నా సీట్లో కాస్త సర్దుకు కూర్చోండి'' అని అడిగాడు కామేశం. ఆ శిశువుని చూసి జాలిపడ్డాడు.

ఆమె ఒక్క నిమిషం కూర్చుంది.

కానీ, వెంటనే లేచిపోయింది. తనకు 'జాగా' చాలదన్నట్లు! అయితే లేచిన వ్యక్తి తన మూడేళ్ల బాబుతో-

''తాతగారి పక్కన కూర్చో'' అంది.

కానీ- ఆ బాబు కూర్చోలేదు.

కామేశం మనస్సు చివుక్కుమంది.

తనకి 26వ ఏట నుంచీ ఇలాంటి అనుభవాలే!

కానీ- ఆలోచించాడు.

''నిజమే! నాకు 25 ఏళ్లకే పెళ్లయితే, సరిగ్గా ఇంత కూతురు వుండేది కాదా? మరి...మూడు సంవత్సరాల మనుమడు వుండేవాడు కాదా? మరి, రిటైర్ కాకుండానే ఎంతమంది తాతగార్లు అవడం లేదు? అయినా సరే 52 ఏండ్ల వయస్సులో బొత్తిగా 72 ఏండ్ల వయస్సున్న వాడిలా కనపడ్డానికి కారణం... ఈ పండు జుత్తే!''

''.......''

అయితే - తిరిగి 'రంగు' వేసుకోవాలా?

అంతర్మథనం చెందాడు.

ఆ అమ్మాయి గాజువాకలో దిగింది.

కానీ - కామేశం బాధగా చూశాడామె వైపు!

బస్ కదిలిపోయింది.

వైజాగ్‌లో బస్ దిగాక, ఆఫీసు వాళ్లు కంపెనీ 'కారు' ఎక్కాడు. అంతలోనే ఆశాలుమెట్ట జంక్షన్ దగ్గర రెడ్ సిగ్నల్ పడడంతో కారు ఆగింది.

చుట్టూ చాలా వాహనాలు ఆగివున్నాయి.

ఒక స్కూల్ వేన్ తన కారు పక్కనే ఆగి వుంది.

అందులో ఓ అబ్బాయి అందంగా వున్నాడు.

''ఉచ్ క్లాస్ యూ ఆర్ స్టడీయింగ్?'' అడిగాడా అబ్బాయిని.

ఆ అబ్బాయి సమాధానం చెప్పలేదు.

''తాతగారు ఏం చదువుతున్నావ్ అంటే మాట్లాడవేం?'' కోప్పడ్డాడు డ్రైవర్!

అప్పుడా అబ్బాయి 'సెవెన్త్ క్లాస్' అన్నాడు.

గ్రీన్ సిగ్నల్ పడ్డాక 'కారు' కదిలింది.

స్టాలిన్ కటౌట్ దాటుతూ కారు స్పీడ్ అందుకుంది.

సినిమా హీరోలకి వయస్సు అడ్డురాదు.

వాళ్లు మేకప్ చేసుకుని యంగ్‌గా కనపడతారు.

కానీ-

అదే వయస్సున్న తనని కలర్ ప్రోసెసింగ్ కరెక్టుగా లేకపోవడం వలన అందరూ 'తాతగారు' అని పిలుస్తున్నారు. అది వాళ్ల తప్పు కాదు. కంటిన్యూగా కలర్ వేయకపోవడం తనదే తప్పు!

మెలనిన్ తన బాడీలో సరిగా ప్రొడ్యూస్ కాకపోవడం తనలో ప్రధాన లోపం!

అందుకే తనని తాతగారూ అని పెద్దరికం అంటగట్టి, మరీ పెద్దవాణ్ని చేసేస్తున్నారు.

ఈ పెద్దరికం అతనిని మానసికంగా మరీ కృంగదీస్తోంది.

మళ్లీ-

''కలర్ ప్రోసెసింగ్-కంటిన్యూ చెయ్యాలా? ఏం చెయ్యాలి?'' ఆలోచిస్తూండగానే అతని 'ఇల్లు' వచ్చేసింది.

కారు దిగేసరికి-

పక్కింటి పద్దెనిమిదేళ్ల అమ్మాయి-

''నమస్తే తాతగారూ'' అని చేతులు జోడించింది.

స్టన్ అయ్యాడు కామేశం,

★